అసంపూర్తి ఇళ్లపై కనికరం ఏదీ?

- గత ప్రభుత్వంలో ఎస్టీలకు 50 గృహాల కేటాయింపు
- అప్పుడే మూడొంతుల నిర్మాణాలు పూర్తి
- ప్రభుత్వం మారటంతో ఆగిన పనులు
- అధికారులు స్పందించాలంటున్న లబ్ధిదారులు

కోసూరువారిపాలెం(మోపిదేవి): గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మూడొంతులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం మారటంతో ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని యానాదులు (ఎస్టీ) కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రాధేయ పడుతున్నారు.


కోసూరువారిపాలెంలో అసంపూర్తిగా ఉన్న భవనాలు


భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని వేడుకుంటున్న లబ్ధిదారులు

విషయం ఇదీ..

మోపిదేవి మండలంలో గత ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో పేదలందరికీ స్థలాలు కేటాయించడంతో పాటు పక్కా భవనాలు నిర్మించింది. అందులో బాగంగా మోపిదేవి మండలంలో యానాదులు (ఎస్టీ) 50 మందిని గుర్తించి స్థలాలు కేటాయించారు. వారి ఆర్థిక స్తోమతను దృష్టిలో పెట్టుకుని అప్పటి గృహనిర్మాణశాఖ అధికారులే భవనాల నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టి వారికి అండగా నిలిచారు. వాటిలో మోపిదేవిలో 13 గృహాలలో 10 పూర్తికాగా, మరో 3 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయి. మెరకనపల్లిలో 11లో 10 పూర్తయ్యాయి. పెదప్రోలులో 15కు 6 భవనాలు పూర్తి చేశారు. గత ప్రభుత్వంలోనే పూర్తయిన కొత్తభవనాల్లో యానాదులు నివాసం ఉంటున్నారు.

సమస్య ఇదీ..

పెదకళ్లేపల్లి, కోసూరువారిపాలెంలో గృహాలు మూడొంతుల వరకు నాటి ప్రభుత్వంలోనే నిర్మాణాలు జరిగాయి. కొద్దిపాటి పనులు పూర్తయితే గృహాలలోకి వెళ్లాలని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తోడు ఎస్టీ కార్పొరేషన్ మరో రూ.63 వేల వరకు అందిస్తుంది. ప్రభుత్వం, కార్పొరేషన్ నిధులను అప్పటి అధికారుల ద్వారా కొంతమంది లబ్ధిదారులు ఉపయోగించుకున్నారు. మరికొంతమంది గృహాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

చేయాల్సిన పనులు ఇవీ..

నిర్మాణ దశలో ఉన్న ఈ గృహాలకు కనీసం లోపల మెరక పోసి ఫ్లోరింగ్ చేస్తే, గృహ ప్రవేశాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. పాలకులు మారారు. అప్పటి అధికారులు బదిలీపై వెళ్లారు. కోసూరువారిపాలెంలో చేపట్టిన 10 భవన నిర్మాణాలు అక్కడే అర్థాంతరంగా నిలిచిపోయాయి.

రోడ్ల నిర్మాణంపై..

గతంలో ఉన్న పూరి గుడిసెల్లోనే విషసర్పాల మధ్య జీవనం కొనసాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ పేరుతో అన్ని రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తామంటున్న కూటమి నాయకులు యానాదుల కాలనీల్లో ఒక్క రోడ్డు కూడా వేయకపోవడంపై కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్, జనసేన నాయకుడు కోసూరు రామాంజనేయులు అధికారులను నిలదీశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు వినతిపత్రం కూడా స్పందనలో అందజేశారు.

పాత గుడిసెలే దిక్కయ్యాయి..

కొత్త భవనాల్లోకి వెళ్లవచ్చని ఎంతో ఆశగా ఉన్నాం. భవనాల్లోకి వెళతామనే ఆనందంతో పాత గుడిసెలను బాగు చేయించకపోవడంతో ఆ పాకలు పూర్తిగా కూలిపోయాయి. చిన్నపాటి వర్షం వచ్చినా పిల్లలతో గ్రామంలోని పాఠశాలలోనో, మరోచోట తలదాచుకోవాల్సి వస్తోంది.

– మేకా బాబూరావు, కోసూరువారిపాలెం



విషసర్పాల మధ్య ఉండలేం..

కాలువగట్లు, రోడ్ల పక్క పూరి గుడిసెల్లో జీవించే తమకు పక్కాభవనాలు వస్తున్నాయని ఎంతో సంబర పడ్డాం. గత జగనన్న ప్రభుత్వంలో మూడొంతులు పూర్తయిన భవనాలకు లోపల మెరక, తలుపులులేక తిరిగి విషసర్పాల మధ్యనే ఉంటున్నాం. ఏ క్షణాన ఏప్రమాదం సంభవిస్తుందోనని రోజూ భయపడుతున్నాం.

– మేకా అంజమ్మ, కోసూరువారిపాలెం

పూరింట్లో ఉండలేక.. భవనాల్లోకి వెళ్లలేక..

గృహాలు త్వరగా పూర్తిచేయాలి. కూలిపోయిన పూరింట్లో ఉండలేక, కట్టిన భవనాల్లోకి వెళ్ల లేక బాధపడుతున్నాం. అధికారులు, నాయకులు స్పందించాలి. గ్రామాలకు దూరంగా ఉండటంతో వర్షాల సమయంలో గ్రామానికి వెళ్లలేక తడుచుకుంటూ గుడిసెల్లోనే ఉంటున్నాం.

– చెట్టు సుబ్రహ్మణ్యం, కోసూరువారిపాలెం



త్వరితగతిన పూర్తిచేస్తాం..

అసంపూర్తిగా మిగిలిన భవనాలను త్వరిత గతిన పూర్తిచేస్తాం. బదిలీల వల్ల ఆలస్యం అయిన మాట వాస్తవమే. యానాదులకు మానవతాదృక్పథంతో కొంత ఆర్థిక సాయం చేస్తే మరింత త్వరగా భవనాలు పూర్తిచేయటానికి వీలు కలుగుతుంది.

– ధర్మేశ్వరరావు, ఏఈ, గృహ నిర్మాణశాఖ, మోపిదేవి

క్లుప్తంగా

అక్షర వెలుగు పుస్తకాల పంపిణీ



మోపిదేవి: ప్రతి మహిళ మూడు రకాల అక్షరాస్యత కలిగి ఉండాలని ఎంపీపీ రావి దుర్గావాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అడల్ట్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి మహిళ మూడు రకాల అక్షరాస్యతను కలిగి ఉండాలని తెలిపారు. అందులో ఒకటి ప్రాథమిక అక్షరాస్యత, రెండు డిజిటల్ అక్షరాస్యత, మూడు ఫైనాన్షియల్ అక్షరాస్యత పట్ల అవగాహన కలిగి ఉండాలని, వీటిపై వివరించారు. అక్షర వెలుగు పుస్తకాలను అందజేశారు. ఎంపీడీవో స్వర్ణభారతి, ఏపీఎం శ్రీనివాస్, ఎంఈవో దుర్గాసాగర్, మహిళలు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌కు 313 మంది హాజరు



పెడన: జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల సెంటరులో 313 మంది పరీక్షకు హాజరయ్యారని కేంద్రం అడ్మిన్ అశోక్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 169 మందికి గాను 161 మంది హాజరయ్యారని, 8 మంది అబ్సెంట్ అయ్యారన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగిన పరీక్షకు 153 మందికి 152 మంది హాజరవగా ఒకరు హాజరు కాలేదన్నారు. మొత్తం 322 మందికి గాను 313 మంది పరీక్షకు హాజరవగా 9 మంది హాజరు కాలేదన్నారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని ఆయన తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం



పర్రచివర(నాగాయలంక): మండల పరిధిలోని పర్రచివర శివారు బిల్లీగ్రాహంనగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గుర్రం స్వామేరు కుటుంబాన్ని బుధవారం రెడ్‌క్రాస్ నాగాయలంక సబ్‌బ్రాంచ్ బాధ్యులు పరామర్శించి సాయం అందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శివవిష్ణు, సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం, కూరగాయలు, వంట సామగ్రి, హైజనిక్ కిట్ బాధితులకు అందజేశారు. మండల తహసీల్దార్, రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ ముప్పిరిశెట్టి హరనాథ్ చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పక్కాగృహం మంజూరు చేయిస్తామన్నారు. గ్రామ సర్పంచి మంచాల శ్రావణి, వీఆర్వో టీజీ సాయిబాబు, లేబాక నాగేశ్వరరావు, పెద్దలు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సర్పంచి కుటుంబానికి సింహాద్రి పరామర్శ


సుబ్బారావు కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న రమేష్‌బాబు

కోడూరు: మండలంలోని సాలెంపాలెం పంచాయతీ సర్పంచి అంగ్రాజు సరోజిని భర్త వెంకటసుబ్బారావు వృద్ధాప్యం కారణంగా మృతి చెందాడు. వెంకటసుబ్బారావు గతంలో సాలెంపాలెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. సుబ్బారావు మృతివార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సర్పంచి సరోజినికి ధైర్యం చెప్పారు. గ్రామ నేతలు పాల్గొన్నారు.

25న ఓటర్ల దినోత్సవం నిర్వహించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయ ప్రసాద్

ఘంటసాల: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ బి.విజయప్రసాద్ అన్నారు. స్థానిక కార్యాలయంలో బీఎల్వోల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలో 44 పోలింగ్ కేంద్రాల్లో ఒక సీనియర్ ఓటరు, నూతన కార్డు పొందిన ఓటరును సన్మానించాలని తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్ఐ కె.శ్రీనివాస్, వీఆర్వోలు, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో వేళలు పాటించడం లేదు

ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

కోడూరు: మండలంలోని మందపాకల శివారు చింతకోళ్ల గ్రామంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ బుధవారం పర్యటించారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉండడంతో నీటి సరఫరాలో సమయపాలన లేదని గ్రామస్తులు బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన బుద్ధప్రసాద్ సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడారు. కమ్మనమోల సీపీడబ్ల్యూ పథకం ద్వారా చింతకోళ్ల గ్రామానికి నేరుగా బైపాస్ పైపులైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. మందపాకల పీడబ్ల్యూ పథకం ద్వారా పైపులైన్ వేసి గ్రామస్తుల అవసరానికి తగినస్థాయి నీటిని సరఫరా చేయాలని సూచించారు. ఈ రెండు పనులు పూర్తి అయ్యే వరకు మందపాకల, చింతకోళ్ల ప్రజలకు సమయపాలన పాటిస్తూ సక్రమంగా తాగునీటిని అందించే బాధ్యతను పంచాయతీ అధికారులు తీసుకోవాలని బుద్ధప్రసాద్ సూచించారు. కృష్ణా పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి.సత్యన్నారాయణ, ఏఈ కిషోర్, కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.


తాగునీటి సమస్యను బుద్ధప్రసాద్‌కు వివరిస్తున్న మహిళలు

రోడ్డు పనుల పరిశీలన

మండలంలోని చింతకోళ్ల నుంచి ఇరాలి వరకు పంచాయతీరాజ్ ప్రాజెక్టు ఇంప్లిమెంట్ యూనిట్ పర్యవేక్షణలో నూతనంగా నిర్మిస్తున్న రహదారిని బుద్ధప్రసాద్ అధికారులతో కలిసి పరిశీలించారు. చింతకోళ్ల నుంచి ఇరాలి వరకు రూ.3.80కోట్లతో రహదారి నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ఈ రహదారిని రామకృష్ణాపురం ప్రధాన రహదారికి కలపనున్నట్లు చెప్పారు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోండి

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బుధవారం ఈ పథకం లబ్ధిదారులతో మాట్లాడి దాని వల్ల వచ్చే ప్రయోజనాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. మచిలీపట్నం నగరంలోని చింతగుంటపాలెంకు చెందిన చోడవరపు ప్రసూన, కొంపెర్ల సుబ్బారావు పథకం ద్వారా పొందిన ప్రయోజనాలను కలెక్టర్‌కు వివరించారు. మొదట్లో తమకు కరెంటు బిల్లులు రూ.3 వేల వరకు వచ్చేవని సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న తరువాత ఇంటి అవసరాలకు పోను మిగులు విద్యుత్ ఉండటం వల్ల ఆదాయం లభిస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ఈ పథకం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. పథకం వివరాల కోసం జిల్లా నోడల్ అధికారి ఎం.భాస్కరరావు (77804 56319)ను సంప్రదించాలన్నారు.

పశువులకు ఆరోగ్య పరీక్షలు

మోపిదేవి: మోపిదేవి, వెంకటాపురం గ్రామాల్లో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద పశు ఆరోగ్యశిబిరాలను బుధవారం ప్రారంభించారు. అనంతరం మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ 55 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు వేసినట్లు, పశువులకు పేడ, బ్లడ్ పరీక్షలు నిర్వహించామని, సుమారు వెయ్యి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు, మసూచి టీకాలు, దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు వివరించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి, ఉప సర్పంచ్ కోనేరు సుందరసింగ్, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, పాల కేంద్రం అధ్యక్షుడు బొందలపాటి ప్రసాద్, అవనిగడ్డ సీఏడీడీఎల్ ల్యాబ్ నుంచి టెక్నీషియన్, పశువైద్య సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.


మోపిదేవిలో పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ మేరీరాణి

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

గూడూరు: పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తుందని పశుసంవర్ధక శాఖ స్పెషల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మ అన్నారు. మండలంలోని చిట్టిగూడూరులో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ఆకస్మికంగా సందర్శించిన డాక్టర్ పద్మ పలు సూచనలు చేశారు. ఈనెల 31 వరకు గ్రామాల వారీగా ప్రభుత్వం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తోందన్నారు. పశువులకు సీజన్ల వారిగా వచ్చే రోగాల బారినుంచి కాపాడుకోవడానికి సకాలంలో టీకాలను వేయించుకోవాలని అడిషనల్ ఏడీ డాక్టర్ సృజన సూచించారు. కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఎస్‌డీపీ ఏడీ డాక్టర్ ఉమా, గూడూరు పశువైద్యాధికారి బి.విజయ్‌కుమార్, మాజీ ఉపసర్పంచి లంకా సుబ్రమణ్యం పాల్గొన్నారు. శిబిరంలో 110 పశువులకు, 500 గొర్రెలకు నట్టల నివారణ మందు వేసినట్లు విజయ్‌కుమార్ వెల్లడించారు.


చిట్టిగూడూరులో సీజనల్ వ్యాధులకు సంబంధించిన కరపత్రాలను ప్రదర్శిస్తున్న డాక్టర్ పద్మ

ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పరిశీలన



కోడూరు: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను బుధవారం వైద్యాధికారుల బృందం పరిశీలించింది. ఆరుగురు డాక్టర్లు సచివాలయ సిబ్బందితో కలిసి మూడు బృందాలుగా ఏర్పడి మండలంలోని 12 పంచాయతీల్లో దీర్ఘకాలిక పింఛన్లను పరిశీలించారు. పెన్షన్‌దారుల వైకల్య ధ్రువీకరణ పత్రాలతో పాటు సంబంధిత మెడికల్ సరిఫ్టికెట్లను వైద్యబృందం పరిశీలించారు. పెన్షన్‌దారుడి ప్రస్తుత వైద్యపరిస్థితిని గమనించారు. పెన్షన్‌దారుడి ఇంటి వద్ద నుంచే వైద్యులు వివరాలను ఆన్‌లైన్ చేశారు. వైకల్య ధ్రువీకరణ పత్రాలు నకిలీవి అని తేలితే అటువంటి పింఛన్లను తొలగించనున్నట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ తెలిపారు. ఈ నెల 28న కోడూరు పంచాయతీలో ఈ పెన్షన్ల తనిఖీ ఉంటుందన్నారు.

'గిడుగు' రామ్మూర్తికి నివాళి

చినకళ్లేపల్లి(ఘంటసాల): తెలుగు భాష పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి సేవలు ఆదర్శనీయమని వైజ్‌మెన్ క్లబ్ జిల్లా గ్రామీణ డైరెక్టర్ గుత్తికొండ కోకిలాంబ అన్నారు. మండలంలోని చినకళ్లేపల్లి గ్రామంలో వైజ్ మెన్ క్లబ్ ఆధ్వర్యంలో గిడుగు వర్థంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైజ్ మెన్ క్లబ్ సభ్యులు శ్రీరామమూర్తి, ప్రకాశరావు, రమ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు


తలగడదీవి(నాగాయలంక): కృష్ణా జిల్లా 84వ వార్షిక సెకండరీ స్కూల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే బాలుర అవనిగడ్డ సబ్‌జోన్ ఆటల పోటీలు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్స్‌లో 23, 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెచ్ఎం బండ్రెడ్డి శివరామప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ ఆటల పోటీలను గురువారం ఉదయం 10గంటలకు అతిథులు ప్రారంభిస్తారని తెలిపారు.

చీడ, పీడలు లేకుండా పురుగు మందులు వాడొద్దు

బంటుమిల్లి: మినుము పైరులో చీడ, పీడలు గమనించకుండా పురుగు మందులు వాడవద్దని పలువురు వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండల పరిధిలోని అర్తమూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మినుము పైరును శాస్త్రవేతలు పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరిగిన సమావేశంలో మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) డీడీఏ జ్యోతిరమణి మాట్లాడుతూ రైతులు అధికారుల సూచనలతో సమగ్ర సస్యరక్షణ చర్యల ద్వార మేలైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త వెంకటలక్ష్మి మాట్లాడుతూ విత్తన, కలుపు యాజమాన్య పద్ధతుల ద్వారా నాణ్యమైన పంటను పండించవచ్చన్నారు. సీనియర్ సైంటిస్ట్ సుధారాణి మాట్లాడుతూ రైతులు పంటను పరిశీలించి చీడ, పీడలను గమనించి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పురుగుమందులు వినియోగించాలన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఏఓ జి. శివ రామకృష్ణ, సచివాలయ వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని రామరాజుపాలెం సచివాలయం పరిధిలో వ్యవసాయ క్షేత్రాలను ఎంఏవో కె.ఆంజనేయకుమార్ బుధవారం సందర్శించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. మినుము పంటలో కాండం గజ్జి తెగులు ప్రభావం కనిపిస్తుందని, దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. హెక్సాకొనాజోల్ గుళికలు ఎకరాకు 400 గ్రాములు చొప్పున చల్లడం ద్వారా తెగులును నివారించ వచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏ రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవాలు



పెడన: పట్టణంలో హజరత్ మౌలాలి జన్మదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఉరుసు మహోత్సవాలను బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం కోలాహలంగా డప్పు కళాకారుల వాయిద్యాలతో జెండా ఊరేగింపు చేశారు. ఉరుసు మహోత్సవం మతసామరస్యానికి ప్రతీగా నిలుస్తోందని మత పెద్దలు పేర్కొంటూ ప్రార్థనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో ఉరుసు ప్రార్థనలు జరిగేలా, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా పెడన పట్టణంలో పర్యటించారు. పెడన సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పెడన, బంటుమిల్లి, గూడూరు ఎస్ఐలు జి.సత్యనారాయణ, గణేష్‌కుమార్, సత్యనారాయణ, సిబ్బంది, ప్రత్యేక పోలీస్ ప్రొటక్షన్ సిబ్బందితో పర్యవేక్షణ ఏర్పాట్లు చేశారు.

ఆలయంలో హుండీ చోరీ



కోడూరు: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో హుండీ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ ధర్మకర్త బడే భావన్నారాయణ తెలిపిన వివరాల ప్రకాం.. ఈ నెల 15న ఆలయంలో ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే రోజు అయ్యప్ప దీక్షాపరులు దేవాలయం వద్ద నుంచి శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆ రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఆలయం కింద భాగంలోని రామ మందిరం వద్ద ఉన్న హుండీ అపహరించాడు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ ఆలస్యంగా గమనించింది. దీంతో ఆలయంలోని సీసీ టీవీలను పరిశీలించగా, ఓ వ్యక్తి హుండీని తీసుకువెళ్తున్నట్లు కనిపించింది. ఈ ఘటనపై కమిటీ సభ్యులు బుధవారం కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దైవత్వంలో దాగున్న మానవత్వం


యండపల్లి నాగమ్మతల్లి ఆలయం వద్ద మొక్కుబడిగా ఉంచిన ధాన్యం కంకుల కుంచె

గ్రామీణ ప్రాంతాలలో సంప్రదాయంగా పాటించే కొన్ని ఆచారాల వెనుక మానవీయ కోణం దాగుంది. రైతులు పండించిన పంటలు ఆటంకాలు లేకుండా ఇంటికి చేరిన తరువాత తమ పంట తాలూకు ధాన్యం కంకులను కుంచెగా చేసి ఆలయాల వద్ద, గృహాల ముందు వేలాడదీస్తారు. ఈ ధాన్యం కంకులను వివిధ రకాల పక్షులు వచ్చి ఆహారంగా తీసుకుంటాయి. ఇందుకోసం మండలంలోని యండపల్లి నాగమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కంకుల కుంచె ఇది.

– కృత్తివెన్ను

బ్రహ్మోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

అవనిగడ్డ: మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్లను శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఫిబ్రవరి 3వ తేదీన స్వామి వారి కల్యాణం, 4వ తేదీన రథోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సారి ప్రత్యేకంగా 6వ తేదీన కోనేటిలో కల్యాణ మూర్తుల తెప్పోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ని ఆలయ ఈవో సత్కరించి స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని అందించారు.